# నమస్తే తెలంగాణ

# నాగర్‌కర్నూల్

5 | మహబూబ్‌నగర్, సోమవారం 17 జూన్ 2024 | NAGARKURNOOL




బాధ్యతలు చేపడుతున్న కలెక్టర్లు విజయేందిర బోయి, బదావత్ సంతోష్, ఆదర్శ్ సురభి, సిక్తా పట్నాయక్

## బాధ్యతలు చేపట్టిన కొత్త కలెక్టర్లు

ఐఏఎస్‌ల బదిలీల్లో భాగంగా ఉమ్మడి జిల్లాకు వచ్చిన నలుగురు కొత్త కలెక్టర్లు ఆదివారం ఆయా కలెక్టరేట్లలో బాధ్యతలు చేపట్టారు. మహబూబ్‌నగర్ కలెక్టర్‌గా విజయేందిర బోయి, నాగర్‌కర్నూల్ కలెక్టర్‌గా బదావత్ సంతోష్, వనపర్తి కలెక్టర్‌గా ఆదర్శ్ సురభి, నారాయణపేట కలెక్టర్‌గా సిక్తా పట్నాయక్ కొలువుదీరారు. ఈ సందర్భంగా వారికి అధికారులు స్వాగతం పలికారు.



క్యూలో బిందెలు ఉంచిన గ్రామస్తులు, బోరుబావి వద్ద నుంచి బైక్‌పై బిందెల్లో నీటిని తీసుకొస్తున్న యువకుడు

# మూణ్నెళ్లుగా అగచాట్లు

- ధరూరు మండలం కొత్తపాలెంలో తాగునీటి గోస
- బీసీ కాలనీలో మూడు నెలలుగా నీళ్లు బంద్
- ప్రజావాణిలో మొరపెట్టుకున్నా పట్టించుకోని అధికారులు
- ప్రజాపాలన అంటే ఇదేనా? అంటూ నిలదీస్తున్న ప్రజలు

ధరూరు, జూన్ 16 : తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక బీఆర్‌ఎస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకం లక్ష్యం నీరుగారుతున్నది. మండలంలోని కొత్తపాలెంలో మూడు నెలలుగా తాగునీటి సమస్య ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని వాపోతున్నారు. ప్రధానంగా బీసీ కాలనీలో తాగునీటి సమస్యపై సోషల్ మీడియాలో పోస్ట్ చేసినా స్పందన కరువైందన్నారు. ప్రజాపాలన అంటే ఇదేనా? మేమే మరమ్మతులు చేసుకోవాలా? అని ప్రశ్నిస్తున్నారు. లైన్‌మెన్‌కు ఫోన్ చేస్తే వాటర్‌మెన్ పేరు చెబుతున్నాడని.. ట్యాంక్‌లోకి నీళ్లు ఎక్కించడం ఇబ్బందవుతుందని పంచాయతీ కార్యదర్శి అంటున్నాడని వాపోయారు. తాగునీటి కోసం బోరు బావుల వద్దకు పోవాల్సిందేనా? అని నిలదీస్తున్నారు.



బోరుబావి వద్ద నీటిని పట్టుకుంటున్న గ్రామస్తుడు

### ట్యాంక్‌కు నీళ్లు ఎక్కించనందుకే..



మూడు నెలలుగా మా కాలనీకి నీళ్లు వస్తలేవు. రోజూ పక్క కాలనీలో తెచ్చుకుంటున్నాం. మా కాలనీలో 60 కుటుంబాలున్నయ్. ఇన్ని కుటుంబాలు పక్క కాలనీలకు పోయి నీళ్లు తెచ్చుకోవాలంటే శానా ఇబ్బందులైతయ్. కింది కాలనీ వాళ్లు భగీరథ పైప్‌లైన్‌కు మోటర్లు అమర్చి చెర్రలు తీసి వాడడం వల్ల నీళ్లు ఎక్కడం లేదని పంచాయతీ కార్యదర్శి చెబుతున్నడు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పుడు మూడు రోజులు ఇబ్బంది లేకుండా వచ్చినయి. మరి కింది కాలనీల వాళ్లు మోటర్లు పెడితే మాకు ఆ మూడురోజులెట్లా నీళ్లొచ్చియ్? ఇక్కడున్న వాటర్‌మెన్ సక్కగ పనిచేస్తలేడు. ట్యాంక్‌కు ఎక్కించనందుకే మా కాలనీకి నీళ్లొస్తలేవు. లైన్‌మెన్ కూడా ట్యాంక్‌కు నీళ్లు ఎక్కించనందుకే వస్తలేవని చెప్పిండు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసినా స్పందిస్తలేరు. *- హనుమంతు, గ్రామస్తుడు*

### ముసలోళ్లం యాడికని పోతం..



నీళ్ల కోసం నాలాంటి ముసలోళ్లు యాడికని పోతరు. కడవలతో అంత దూరం పోయి నీళ్లు తెచ్చుకోలేం. మమ్మల్ని ఎందుకింత ఇబ్బంది పెడుతున్నరో అర్థమైత లేదు. మా పిల్లలను బతిమాలి నీటిని తెప్పించుకుంటున్నాం. ఇప్పుడు అందరికీ పనుల కాలం.. నీళ్లకే ఇన్ని తంటాలు పడుతున్నాం. పొద్దు పోతున్నది. నీళ్లకే ఇంత టైమైతే వంట పనులు ఎప్పుడు చేసుకోవాలా? పనులకెప్పుడు పోవాలా? మా బాధ పట్టించుకొని సాయం చేయండి సారూ. కాంగ్రెస్ గవర్నమెంట్ వచ్చినంక నీళ్లకు చాలా ఇబ్బందైతున్నది. మమ్మల్ని పట్టించుకునే నాథుడే లేడు. పెద్ద సారోళ్లకు మొరపెట్టుకుంటే మూడురోజులు వచ్చినయ్. తరువాత బంద్ అయినయ్. ఇప్పటికైనా మా సమస్యను తీర్చండి.

*- నర్సమ్మ, బీసీ కాలనీవాసి, కొత్తపాలెం*

### దీనికంతటికీ ప్రభుత్వమే కారణం..



గ్రామీణ వ్యవస్థ అస్తవ్యస్తం కావడానికి, ప్రజలు ఇబ్బందులు పడడానికి ప్రస్తుత ప్రభుత్వమే కారణం. గ్రామ పంచాయతీల్లో నిధులు లేవు. అప్పుడు పంచాయతీ కార్యదర్శులు పనులెలా చేస్తరు? పంచాయతీలో ప్రతిరోజూ ఖర్చులు చాలా ఉంటాయి. ఇప్పటికే కార్యదర్శులు గ్రామస్థాయిలో సొంత పైసలు ఖర్చుపెట్టి పనులు చేయిస్తున్నరు. వాళ్లు కూడా ఎంతకాలమని పెడ్తరు. అందుకే గురువారం జరిగిన సర్వసభ్య సమావేశాన్ని బీఆర్‌ఎస్ ఎంపీటీసీలందరం కలిసి వాకౌట్ చేశాం. అయినా సమావేశం కొనసాగించారు. జెడ్పీ చైర్‌పర్సన్ కూడా సమస్యను ప్రభుత్వాధికారులపైనే నెట్టారు. ప్రభుత్వం నిధులివ్వకపోతే గ్రామాల అభివృద్ధి ఎట్లా జరుగుతది? అధికారులైనా నిధులుంటేనే పనిచేస్తరు. ఇకనైనా ప్రభుత్వం మేల్కోవాలని కోరుకుంటున్నా.

*- పచ్చర్ల సుదర్శన్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ, ధరూర్ మండలం*

# వైద్యహబ్‌గా గద్వాల

- ప్రారంభానికి సిద్ధమైన మెడికల్ కళాశాల
- ప్రిన్సిపాల్, ఫ్యాకల్టీ నియామకాలు పూర్తి
- ఈ ఏడాది షురూ కానున్న తరగతులు
- జిల్లావాసులకు చేరువ కానున్న వైద్యసేవలు



గద్వాల మెడికల్ కళాశాల భవనంలో నిర్మించిన గదులు

గద్వాల, జూన్ 16 : వైద్య సేవల కోసం సమైక్య రాష్ట్రంలో పడిన గోసకు చెక్ పెడుతూ స్వరాష్ట్రంలో అందరికీ అధునాతన వైద్యం చేరువవుతున్నది. తెలంగాణ ఏర్పాటయ్యాక ఉమ్మడి జిల్లాలో మొదటగా పాలమూరు, ఆ తర్వాత వనపర్తి, నాగర్‌కర్నూల్, జోగుళాంబ గద్వాల, నారాయణపేట జిల్లాల్లో మెడికల్ కళాశాలల ఏర్పాటుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. దీంతో ఆ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు అవకాశం ఏర్పడింది. తెలంగాణ ఏర్పాటుకు ముందు జిల్లా ప్రజలకు వైద్యం సరిగ్గా అందేది కాదు. ఏదైనా ప్రమాదం జరిగినా, అత్యవసర చికిత్సల కోసం కర్నూల్ లేదా హైదరాబాద్‌కు వెళ్లాల్సిందే. తెలంగాణ ప్రభుత్వం చిన్న జిల్లాలను ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే ఆలోచనతో జిల్లా కేంద్రంలోని దవాఖానలో సకల వసతులు కల్పించింది. విద్యాపరంగా వెనుకబడిన జోగుళాంబ గద్వాల జిల్లాకు కేసీఆర్ ప్రభుత్వం మెడికల్ కళాశాలను మంజూరు చేసింది.

**ఫ్యాకల్టీ నియామకాలు పూర్తి..**

ఈ విద్యాసంవత్సరం నుంచి కళాశాల ప్రారంభానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇది వరకే జిల్లా మెడికల్ కళాశాలకు ప్రిన్సిపాల్‌ను కేటాయించగా కళాశాల, దవాఖానలో పనిచేసేందుకు 7 ట్యూటర్, 22 సీనియర్ రెసిడెంట్ పోస్టులను తాత్కాలిక పద్ధతిలో భర్తీ చేసింది. అనాటమీ (2), ఫిజియాలజీ(2), బయోకెమిస్ట్రీ-1, ట్యూటర్ పోస్టులు, ఫార్మాలజీ, పాథాలజీ, మైక్రోబయాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, కమ్యూనిటీ మెడిసిన్ పోస్టుకు ఒక్కొక్కరిని, రెండు జనరల్ మెడిసిన్, రెండు జనరల్ సర్జరీ, సైక్రియాటిస్ట్, పీడియాట్రిక్, ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ, ఆప్తమాలజీ, ఓబీజీ, అనెస్తిషియా, డీవీఎల్ సీనియర్ రెసిడెంట్‌గా ఒక్కొక్కరిని, రేడియో డయాగ్నొస్టిక్‌కు ఇద్దరిని కాంట్రాక్ట్ పద్ధతిన భర్తీ చేసింది. వీటితో పాటు 11మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ముగ్గురు ల్యాబ్ అసిస్టెంట్లు, 9 ఆఫీస్ సబార్డినేట్లు, థియేటర్ అసిస్టెంట్ కోసం దరఖాస్తులను ఆహ్వానించి డిప్ పద్ధతిన పోస్టులను భర్తీ చేసింది. ఇక కళాశాల ప్రారంభమే మిగిలిపోయింది. గద్వాల జిల్లాకు మంజూరైన మెడికల్ కళాశాలను రద్దు చేస్తారని పనికట్టుకొని ప్రచారం చేసిన వాళ్లకు ప్రభుత్వం పోస్టుల భర్తీతో సమాధానం చెప్పింది.

స్వరాష్ట్రం సిద్ధించాక రోగులకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించేందుకు గానూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లా దవాఖానలో 100 నుంచి 300 పడకలకు పెంచారు. అదేవిధంగా రోగ నిర్ధారణ పరీక్షలు చేయడానికి తెలంగాణ డయాగ్నొస్టిక్ సెంటర్‌ను ఏర్పాటు చేసి ఉచితంగా 57 పరీక్షలు చేస్తున్నారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ప్రస్తుతం రోగులకు అందుతున్న 57 పరీక్షలను కలుపుకొని మొత్తం 134 పరీక్షలు అందుబాటులోకి వచ్చాయి. ఇందులో పాథాలజీ, రేడియాలజీ ల్యాబ్స్ అందుబాటులోకి వచ్చాయి. ప్రైవేట్ దవాఖానలో ఎన్నిరకాల టెస్ట్‌లు చేస్తారో అవన్నీ తెలంగాణ డయాగ్నొస్టిక్ సెంటర్‌లో ఉచితంగా చేయడమే కాకుండా 24గంటల్లో ఫలితాలు ఇవ్వనున్నారు. రెండేండ్ల కింద కేసీఆర్ ప్రభుత్వం జిల్లాకు నర్సింగ్ కళాశాలను మంజూరు చేసింది. కాగా ప్రస్తుతం జిల్లా కేంద్రంలో కళాశాల విజయవంతంగా కొనసాగుతున్నది. రోగులకు చికిత్స అనంతరం అవసరమైన మందులు అందించడానికి ప్రభుత్వం సెంట్రల్ డ్రగ్ స్టోర్‌ను సైతం మంజూరు చేసింది. ప్రస్తుతం యువకులు ఎక్కువగా గుండెపోటుతో మరణిస్తుండడంతో దానిని అడ్డుకునేందుకు జిల్లా దవాఖానలో టినెక్ట్ ప్లాస్ టీకాను అందుబాటులో ఉంచింది. వెనుకబడిన జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో కేసీఆర్ గద్వాలకు మెడికల్ కళాశాలను మంజూరు చేయడంతో జిల్లా వైద్యపరంగా అభివృద్ధి చెందనున్నది. ప్రస్తుతం ఉన్న దవాఖాన సూపర్ స్పెషాలిటీ జనరల్ దవాఖానగా మారే అవకాశం ఉన్నది. అదేవిధంగా జిల్లా దవాఖానలో వైద్యుల కొరత తీరి అధునాతన ల్యాబ్‌లు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉన్నది.

### పనులు పూర్తి చేయాలని ఆదేశించాం..



ఈ అకాడమిక్‌లో మెడికల్ కళాశాల ప్రారంభమయ్యే అవకాశం ఉన్నది. మిగిలిన పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించాం. వెనుకబడిన గద్వాల జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరు చేయించి, పేదలకు అధునాతన వైద్యం అందించాలన్న నా కోరిక తీరింది. ఈ జిల్లాపై ప్రత్యేక దృష్టి పెట్టి మెడికల్ కళాశాల మంజూరు చేసిన కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుకు ఎప్పటికీ రుణపడి ఉంటాం. జిల్లాకు నర్సింగ్ కళాశాల మంజూరు చేయగా తరగతులు ప్రారంభమయ్యాయి. మెడికల్ కళాశాల ఏర్పాటుతో ఈ ప్రాంతం వైద్య హబ్‌గా మారనున్నది. ప్రస్తుత ప్రభుత్వం మెడికల్ కళాశాలకు అవసరమైన ఫ్యాకల్టీ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానించి భర్తీ చేయడం సంతోషంగా ఉన్నది. *- బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, గద్వాల*

### ఈ ఏడాది అందుబాటులోకి..

జోగుళాంబ గద్వాల విద్యార్థులకు 2024-25 విద్యా సంవత్సరంలో మెడికల్ కళాశాల అందుబాటులోకి రానున్నది. ఒక్కో కళాశాలలో 100 ఎంబీబీఎస్ సీట్లతో తరగతులు ప్రారంభించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కాగా సీట్ల సంఖ్యపై కొంత స్పష్టత రావాల్సి ఉన్నది. కొత్త కళాశాలల్లో మౌలిక సదుపాయాలు, పడకల సంఖ్యను జాతీయ మెడికల్ కమిషన్ పరిశీలించాల్సి ఉంది. ఎన్‌ఎంసీ నిబంధనల ప్రకారం ఎంబీబీఎస్ సీట్లకు అనుమతి రావాలంటే ప్రతి కళాశాలలో 21 స్పెషలైజేషన్ విభాగాలు ఉండాలి. పడకల ఆక్యుపెన్సీ ఏటా కనీసం 80శాతం ఉండాలి. 50 సీట్లకు 220 పడకలు, 100సీట్లకు 420 పడకలు ఉండాలి. దీనిని బట్టి కళాశాలకు సీట్ల కేటాయింపు చేస్తారు.



గద్వాల మెడికల్ కళాశాల భవనం

# ఆయకట్టుకు సాగునీరందిస్తాం

- దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

మదనాపురం, జూన్ 16 : సరళాసాగర్ ప్రాజెక్టు ద్వారా ఆయకట్టు రైతులకు సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని తిర్మలాయపల్లి శివారులోని భీమా ఫేజ్-2, సరళాసాగర్ పంప్‌హౌజ్‌లో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి పూజలు చేసి ప్రాజెక్టులోకి నీటిని విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సకాలంలో సాగునీరు, విద్యుత్, ఎరువులు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సరళాసాగర్ ప్రాజెక్టు కింద 10 గ్రామాల్లో 4వేల ఎకరాలకు పైగా ధాన్యం పండిస్తున్నారని, చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేలా అధికారులకు సూచించామన్నారు. మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల రిపేరు చేయించేందుకు అధికారులు నివేదికలు అందజేస్తే, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అవసరమైన నిధులు తీసుకొస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పద్మావతి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్‌నారాయణ, మాజీ వైస్ ఎంపీపీ శంకర్‌యాదవ్, నీటి తీరువా సంఘం అధ్యక్షుడు వెంకటన్న, నాయకులు నాగన్న, మణివర్ధన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, జగదీశ్, కృష్ణ, రామకృష్ణ, మహేశ్, రంగన్న, శ్రీధర్‌రెడ్డి, రాములుగౌడ్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



పంప్‌హౌజ్ వద్ద నీటికి పూలు చల్లుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

### జాతీయస్థాయి అథ్లెటిక్స్‌కు స్వప్న ఎంపిక



స్వప్న

తిమ్మాజిపేట, జూన్ 16 : మండలంలోని పుల్లగిరి పంచాయతీ పరిధిలోని కోడావత్ తండాకు చెందిన స్వప్న ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్‌లో జరుగనున్న జాతీయస్థాయి యూత్ అథ్లెటిక్స్‌లో 1000 మీటర్ల పరుగు పోటీలకు ఎంపికైంది. ఆటో డ్రైవర్ కుమార్తె అయిన స్వప్న ప్రస్తుతం గచ్చిబౌలిలోని సాయి హాస్టల్‌లో ఉంటూ ఇంటర్ చదువుతున్నది. ఇటీవల హన్మకొండలో జరిగిన ఎంపికలో వెయ్యి మీటర్ల పరుగులో రాణించి జాతీయస్థాయికి ఎంపికైంది. చిన్ననాటి నుంచి తన బాబాయ్ రవి వద్ద శిక్షణ పొందిన స్వప్న రాష్ట్రస్థాయిలో పలు పతకాలను సాధించింది. స్వప్న ఎంపికపై జిల్లా అథ్లెటిక్స్ అధ్యక్ష, కార్యదర్శులు విజేందర్, స్వామి, ప్రతినిధులు లావణ్య, భిక్షపతి, సుబ్బారావు హర్షం వ్యక్తం చేశారు.



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో పొట్టేళ్లను కొనుగోలు చేస్తున్న ముస్లింలు

# నేడు బక్రీద్

*బక్రీద్ పండుగను సోమవారం ఘనంగా నిర్వహించేందుకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ముస్లింలు ఏర్పాట్లు చేపట్టారు. ఈద్గాల ఆవరణను శుభ్రం చేసి సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఈదుల్ జుహా నమాజ్ కోసం వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఎక్కడికక్కడ ఏర్పాట్లు చేశారు. పొట్టేళ్లను కొనుగోలు చేసేందుకు పోటీపడ్డారు.*

# 8.5 టీఎంసీలకు చేరిన జూరాల

- 8,849 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 1,476 క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదు

గద్వాల, జూన్ 16 : జూరాల ప్రాజెక్టుకు ఆదివారం 8,849 క్యూసెక్కులుగా నమోదైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318.516 మీటర్లు కాగా ప్రస్తుతం 317.960 మీటర్లకు చేరుకున్నది. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.531 టీఎంసీలకు చేరినట్లు అధికారులు తెలిపారు. నెట్టెంపాడ్ లిఫ్ట్‌కు 375 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్-1కు 650క్యూసెక్కులు, కోయిల్‌సాగర్ లిఫ్ట్‌కు 315 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఇన్‌ఫ్లో 8,849 క్యూసెక్కులు కాగా అవుట్‌ఫ్లో 1,476 క్యూసెక్కులుగా నమోదైనట్లు అధికారులు తెలిపారు.



జూరాల ప్రాజెక్టులో ప్రస్తుత నీటి నిల్వ

**ఆర్డీఎస్‌కు స్వల్ప వరద**

అయిజ, జూన్ 16 : కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు స్వల్ప వరద కొనసాగుతున్నది. ఆదివారం 6,658 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 6,658 క్యూసెక్కుల వరద సుంకేసుల బ్యారేజీకి చేరుతున్నదని ఏఈ రాందాస్ తెలిపారు. ప్రస్తుతం ఆనకట్టలో 8.8 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

**టీబీ డ్యాంకు..**

టీబీ డ్యాంకు ఇన్‌ఫ్లో 1,520 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 301 క్యూసెక్కులుగా నమోదైంది. డ్యాంలో 1,633 అడుగుల పూర్తిస్థాయి నీటిమట్టానికి గానూ ప్రస్తుతం 1,583.03 అడుగులకు చేరినట్లు డ్యాం సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.

# కోళ్లపందేల స్థావరంపై దాడి

ఖిల్లాఘణపురం, జూన్ 16 : కోళ్ల పందేలు నిర్వహిస్తుండగా దాడులు నిర్వహించి పలువురిపై కేసు నమోదు చేసిన ఘటన ఖిల్లాఘణపురం మండలం మానాజీపేట శివారులో చోటుచేసుకున్నది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని మానాజీపేట శివారులో గార్లబండతండాకు చెందిన మాన్యానాయక్ ఆధ్వర్యంలో ఆదివారం కోళ్ల పందేలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో దాడి చేసినట్లు తెలిపారు. 16 బైకులు, 7 సెల్‌ఫోన్లు, 11 పందెం కోళ్లతోపాటు రూ.10,730 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. అదేవిధంగా మాన్యానాయక్, చిన్నమందడికి చెందిన బాలరాజు, మహబూబ్‌నగర్‌కు చెందిన శ్రీనివాస్, కనిమెట్టకు చెందిన రాజశేఖర్, శ్రీరంగాపురానికి చెందిన సత్యనారాయణ, మదనాపురానికి చెందిన విష్ణు, జడ్చర్లకు చెందిన రాజును అదుపులోకి తీసుకోగా మరికొందరు పరారైనట్లు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని తెలిపారు.



కోళ్ల పందెం నిర్వాహకులను పట్టుకున్న పోలీసులు